ప్రశాంతంగా ఉన్న దేశం భారత్ ఒక్కటే

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మన్సూరాబాద్: ప్రపంచ దేశాల్లో ప్రశాంతంగా ఉన్న దేశం భారత్ ఒక్కటేనని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన బుధవారం మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో 'దేశ విభజన గాయాలు.. స్మారక దినం' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. మనం మువ్వన్నెల జెండా ఎగురవేసి జరుపుకుంటున్న సంబరాల వెనుక ఎంతో విషాదం , త్యాగం ఉందన్నారు. లక్షలాది మంది భారత మాత బిడ్డలు జైలులో ఉండి ఉరికంబం ఎక్కారని, దేశ విభజన సమయంలో మన జాతి ఊచకోతకు గురైందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ బలహీనపడితే.. దేశం బలహీనపడుతుందని ప్రజలంతా భావిస్తున్నారని, మోదీకి ఇంకా బలాన్ని ఇవ్వాలన్నారు. స్వాతంత్య్ర వేడుకలంటే సంబరాలు మాత్రమే కాదని, జరిగిన గాయం అని గుర్తు చేసుకోవాలని, నిజాం నిరంకుశ తత్వాన్ని కూడా మరచిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహాగుప్తా, క్లోం నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, చింతల సురేందర్‌యాదవ్, నాంపల్లి రామేశ్వర్, నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభం..

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఇందిరానగర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లాలిత్యం హాస్పిటల్స్ (మదర్ అండ్ చైల్డ్‌కేర్)ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే ఆదరణ పొందుతారని, ఈ దిశగా యాజమాన్యం కృషి చేయాలని ఈటల సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, క్లోం నవజీవన్‌రెడ్డి, హాస్పిటల్స్ యాజమాన్యం డాక్టర్ వంశీమోహన్, కోండోజు శ్రీనివాస్, మొరిశెట్టి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


పనులు పరిశీలిస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పర్యటించారు. సాగర్ ఎన్‌క్లేవ్ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన చెత్తను తీయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.చాలా ప్రాంతాలలో తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటి ఏర్పాటు కోసం జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కస్తానన్నారు. కార్పొరేటర్ వెంట గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.

'గురుకులాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

హస్తినాపురం: ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే గురుకుల విద్యా సంస్థలలో చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని రాష్ట్ర కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఆరోపించారు. బుధవారం హస్తినాపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిభ నిలయాలైన గురుకుల పాఠశాలలో నాసీరకం నాణ్యతలేని ఆహారం దుర్గంధపూరితమైన పరిసరాలతో వేలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. గురుకులాలలో చదువుకుంటున్న అనేక మంది విద్యార్థులు పాము, తేలుకాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వంలో చలనం రావడంలేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గురుకులాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టు రమేశ్, ఎస్ శీనునాయక్, చేపూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

జాతీయ జెండాల పంపిణీ


జెండా అందజేస్తున్న శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి కోరారు. బుధవారం బీజేపీ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని అందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని అన్నారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, శంకరాచారి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌కు చెందిన బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంజరి వినోద్‌కుమార్, హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సీహెచ్ సురేష్, మలక్‌పేట ట్రిల్లర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి బృందం బుధవారం మలక్‌పేట ఎస్‌హెచ్‌ఓ పిడమర్తి నరేష్‌ను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అందరూ పోలీసులకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.


ఇన్‌స్పెక్టర్ నరేష్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

దేశ సమగ్రతను కాపాడాలి


ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రతీ పౌరుడు దేశ సమగ్రతను కాపాడటానికి పాటు పడాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ పిలుపు మేరకు బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కృష్ణతులసినగర్‌లోని ఇంటిపై కార్పొరేటర్ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్, కొప్పుల దినేష్, సురేందర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగోలు: హర్ ఘర్ తిరంగాలో భాగంగా కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మోహననగర్‌లోని తన ఇంటిపై, కార్పొరేటర్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో మనందరం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వతంత్రం ఆనాటి అమరుల త్యాగాల ప్రతిఫలమని అన్నారు. ఈ దేశం ప్రపంచంలోనే ప్రజాస్వామిక విలువలు, స్ఫూర్తితో ప్రపంచ దేశాలకు ఆదర్శవంతంగా నిలుస్తున్న దేశం భారతదేశమని ఇంత గొప్ప సంస్కృతి, సంప్రదాయం, దేశ గొప్పతనాన్ని చాటి చెప్పే సన్నివేశమే 'హర్ ఘర్ తిరంగా' అన్నారు.

కొత్తపేట డివిజన్‌లో..

నాగోలు: హర్ ఘర్ తిరంగాలో భాగంగా కొత్తపేట డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ టీచర్లకు బీజేపీ నాయకులు బొల్గం యశ్పల్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. స్వాతంత్ర దినోత్సవ రోజు ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లపై జాతీయ జెండాలను రెపరెపలాడించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, రాజు, తరుణ్ సింగ్ ఠాకూర్, సంప్రీత, విష్ణు, పవన్, వినోద, వరుణ్ ,అవినాష్ పాల్గొన్నారు.


తన నివాసంపై జెండా ఎగరవేస్తున్న పవన్‌కుమార్



వేసేయ్ పాగా!

- ఆక్రమణలకు గురవుతున్న ప్రజావసరాల స్థలాలు
- నాగోలు న్యూ వెంకటరమణ కాలనీలో పార్కు కోసం వదిలేసిన భూమి కబ్జా
- రక్షించాలంటున్న కాలనీల వాసులు
- స్పందించని అధికారులు

నాగోలు: అధికారుల పర్యవేక్షణ లేక విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల పాలవుతున్నాయి. స్థలాలు విక్రయించేటప్పుడు లేఅవుట్ వేసిన వారు పార్కు, క్రీడా ప్రాంగణం, పాఠశాల, దేవాలయం, సామాజిక భవనం ఇలా అనేక సదుపాయాల కోసం స్థలాలు కేటాయిస్తూ ప్లాట్లను విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజా అవసరాల కోసం స్థలం కేటాయించాల్సిందే. గతంలో పార్కుల కోసం వదిలేసిన స్థలాలపై పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాదారులు వాటిపై కన్నేస్తున్నారు. ఎల్‌బీ నగర్ హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్‌లో వివిధ కాలనీలో గతంలో పార్క్ స్థలాలు, ఇతర అవసరాలకు వదిలేసిన స్థలాలను కబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి రూ. కోట్లు విలువచేసే భూములను కబ్జా చేస్తున్నారు.


కాలనీలో మట్టిని నింపుతున్న దృశ్యం

మచ్చుకు కొన్ని

◆ ఉప్పల్ మండల పరిధిలోని నాగోలు గ్రామంలో సర్వే నెంబర్ 145లో న్యూ వెంకటరమణ కాలనీలో గతంలో లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. కాలనీ ఏర్పాటు చేసే సమయంలో పురాతన బావి ఉండడంతో ఈ స్థలం పార్క్‌కు వదిలేశారు.ఈ స్థలంపై జీహెచ్‌ఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం కొంతమంది ఆ స్థలంపై కన్ను వేశారు. సెలవు రోజుల్లో అధికారులు ఉండరని భావించి బావిని మట్టితో నింపారు. అయితే.. దీన్ని అడ్డుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో విలువైన భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా కాలనీల వాసులు తమ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను రక్షించాలంటూ జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.


కాలనీలో పార్క్ కోసం వదిలేసిన లేఅవుట్‌లోని స్థలం(ఫైల్)

◆ నాగోలు డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో గతంలో పార్క్ కోసం వదిలేసిన స్థలంలో బండ్లగూడ చెందిన ఓ వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి భారీ ఎత్తున్న నిర్మాణాలు చేస్తున్నాడు. ఈ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధి జోక్యం చేసుకుని పెద్ద ఎత్తున్న సెటిల్‌మెంట్ చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. సదరు నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై అనుమతులు జారీ చేశారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ బండ్లగూడ ధనలక్ష్మి కాలనీలో పార్క్ కోసం వదిలేసిన స్థలాన్ని కబ్జాదారులు అక్రమ నిర్మాణం చేపట్టి పార్క్ స్థలం కనిపించకుండా చేశారు. ఇవేకాక డివిజన్ పరిధిలో అనేక ప్రాంతాల్లో ప్రజా అవసరాల కోసం వదిలేసిన భూములను మోసపూరితంగా కబ్జాదారులు అమాయకులను పక్కదోవ పట్టించి విక్రయిస్తున్నారు. వీరికి కొందరు గతంలో లేఅవుట్ చేసిన వారు సహకరిస్తున్న పరిస్థితి ఏర్పడింది. అడ్డుకోవాల్సిన వారు భవన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోసం ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

గతంలో పార్క్ అభివృద్ధి నిధులు మంజూరు..

గతంలో పార్క్ అభివృద్ధి కోసం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు మల్లారెడ్డి ఉన్నప్పుడు నిధులు కేటాయించారు. కానీ కొంత మంది పార్క్ అభివృద్ధి జరగకుండా అడ్డుకున్నారు. ఈ విషయం గుర్తించి జీహెచ్‌ఎంసీ అధికారుల రికార్డులో పార్క్ స్థలంగానే ఉంది. గతంలో కాలనీ ఏర్పాటు చేసే క్రమంలో లేఅవుట్ చేసిన వారితో నేడు కబ్జాదారులు కుమ్మక్కై ప్రజా అవసరాల కోసం వదిలేసిన స్థలాలపై కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి డాక్యుమెంట్‌లు తయారు చేస్తున్నారు. కొత్త మంది అధికారుల సహకారంతో క్రయ విక్రయాలు జోరందుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హైడ్రా అధికారులు స్పందించాలి..

కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములపై హైడ్రా అధికారులు స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్ పరిధిలో న్యూవెంకటరమణ కాలనీలో ప్రజా అవసరాల కోసం వదిలేసి స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలంటున్నారు. మధురానగర్ కాలనీలో పార్క్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టిన వారు, కబ్జాదారులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.21, వంకాయ రూ.40, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.35, దొండ రూ.31, ఆలుగడ్డ రూ.36, ఉల్లిగడ్డ రూ.46, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.13, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, అర్వి రూ.40, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: మాగ్నస్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో చైతన్యపురి చౌరస్తాలోని మాగ్నస్ ఈఎన్‌టీ ఆసుపత్రి వద్ద ఈ నెల 15 నుంచి 17 వరకు ఉచిత వినికిడి పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆడియాలజిస్ట్ నాగకిరణ్ తెలిపారు. ఈ క్యాంపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని మరిన్ని వివరాలకు 9703235513, 9985631926 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పరామర్శ


శ్రీధర్‌ను పరామర్శిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్‌ను బుధవారం మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట అరవింద్ శర్మ, నగేష్, రామ్ నర్సింహ గౌడ్ శ్రీనివాస్ సాజిద్, మహేందర్ రెడ్డి, కొంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి

రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు


ఎన్టీఆర్‌నగర్‌లో కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమిస్తూ శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఎల్‌బీనగర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాంతంలో బుధవారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి ప్రజలతో మమేకమై పని చేయాలని సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని అదుపులో పెట్టాలని ఆదేశించారు. పలు వీధుల్లో స్థానిక ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అన్ని వేళలా పోలీసు అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేస్తున్నారని, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112 టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మహిళా రక్షణ కోసం షీటీమ్స్ బృందాలు అన్ని ప్రాంతాల్లో విధుల్లో ఉంటారన్నారు. సీపీ వెంట డీసీపీలు ప్రవీణ్ కుమార్, సునీతారెడ్డి, డీసీపీ ఎస్ఓటీ మురళీధర్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ఉన్నారు.

నీటి బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్


డీజీఎం అభిలాష్

చాదర్‌ఘాట్: మలక్‌పేట డివిజన్ జలమండలి ఆధ్వర్యంలో గురువారం(నేటి) నుంచి వారం రోజుల పాటు నల్లా నీటి బకాయిల వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీజీఎం ఎస్.అభిలాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రూ. 12 కోట్లు వసూలు కావాల్సి ఉందని బకాయిదారులకు రెడ్ నోటీసు జారీ చేశామని చెల్లించకుంటే నల్లా కనెక్షన్స్ తొలగిస్తామన్నారు.

కూల్చివేస్తే.. కాల్చుకుంటాం

నిర్మాణాన్ని తొలగించేందుకు వెళ్లిన అధికారులకు చేదు అనుభవం

మహేశ్వరం: చెరువు శిఖం భూమిలో నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించేందుకు వెళ్లిన నీటి పారుదల శాఖ అధికారులకు కబ్జాలో ఉన్న కుటుంబసభ్యుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. జల్‌పల్లి మున్సిపాలిటీలోని తాళ్లకుంట చెరువు వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తాళ్లకుంట శిఖం భూమి(119 సర్వే నంబర్)లో ఓ కుటుంబం 100 గజాల విస్తీర్ణంలో బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టింది. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు శశికళ, జనార్ధన్‌లు మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి కూల్చివేసేందుకు అక్కడికి చేరుకున్నారు. కూల్చివేస్తే తాము పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామంటూ సదరు కుటుంబంలోని మహిళలు భీష్మించారు. పోలీస్ బందోబస్తు లేని కారణంగా అధికారులు వెనుదిరిగారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి పోలీస్ బందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం బాలాపూర్ ఆర్.ఐ జమీల్ కూడా అక్కడికి చేరుకొని నిర్మాణాన్ని పరిశీలించారు.



పూర్తయినా ప్రారంభించరా?

ప్రజల సౌకర్యార్థం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో రూ.50 లక్షల ఎంపీ నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. భవనంలోని పనులన్నీ పూర్తయి దాదాపుగా 3 నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ పీహెచ్‌సీ ప్రారంభమైతే స్థానికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని త్వరితగతిన ప్రారంభమయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –చాదర్‌ఘాట్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


పార్కులో మొక్క నాటుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: స్వచ్ఛమైన గాలి, నీరు కావాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీనగర్ సురభి పార్క్‌లో కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటడంతో పాటు సందర్శకులు కూర్చునేందుకు కార్పొరేటర్ తన సొంత నిధులతో బెంచీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘురాం నేత, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, అమరేందర్‌రెడ్డి, కృష్ణరావు, కాంతారావు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ



వనస్థలిపురం: వనస్థలిపురంలోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు బుధవారం సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలోని సేఫ్ అనాథ బాలికల ఆశ్రమానికి నాలుగు క్వింటాళ్ల బియ్యం, 30 కిలోల కందిపప్పును అందజేశారు. ఇటీవల పాఠశాలలో చారిటీ డే సందర్భంగా విద్యార్థులు సేకరించిన సరుకులు, యాజమాన్యం మరికొంత కలిపి ఆశ్రమానికి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అభాగ్యుల పట్ల అందరు సేవాభావం కలిగి ఉండాలని, అందులో భాగంగానే విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఏఓ శేషారావు, అకాడమిక్ డీన్ రాజశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

బడంగ్‌పేట్: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన మూడు కుటుంబాలు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. నిస్సాయస్థితిలో ఉన్న ఆ కుటుంబాలు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు.